



జిల్లాకు మరో రెండు పరిశ్రమలు

నాయుడుపేట స్పెషల్‌జోన్‌లో బుధవారం రెండు పరిశ్రమలకు మంత్రి అమర్‌నాథ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. - 8లో



17న నింగిలోకి 'జీఎస్‌ఎల్‌వీ'

శ్రీహరికోట షార్ నుంచి ఈ నెల 17వ తేదీన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్14 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. - 8లో



దొంగే.. దొంగ ఓటర్లంటూ..!

చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు దొంగ ఓటర్లను చేర్పించి, అధికార పార్టీపై నెపం మోపుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

రహదారుల అభివృద్ధికి వినతి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎంపీ గురుమూర్తి కోరారు. బుధవారం ఈ మేరకు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి విన్నవించారు. ఎంపీ మాట్లాడుతూ చెన్నై–అరక్కోణం వయా పుత్తూరు రహదారి విస్తరణకు కోరిన వెంటనే నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలోనే తిరుపతి ఇంట్రా మోడల్ బస్ స్టేషన్ పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. నాయుడుపేట సమీపంలోని విన్నమాల వద్ద జాతీయ రహదారి విస్తరణ చేపట్టనున్న నేపథ్యంలో 57వ కిలోమీటర్ ర్యాంపు–1 వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక హైవే విస్తరణ పనులు ప్రారంభమైతే ప్రమాదాల సంఖ్య పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కేంద్రమంత్రి స్పందిస్తూ అండర్‌పాస్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.

శాస్త్రోక్తం.. సామూహిక అక్షరాభ్యాసం



గురుదక్షిణామూర్తి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వసంతి పంచమిని పురస్కరించుకుని బుధవారం శాస్త్రోక్తంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద తల్లిదండ్రులు తమ చిన్నారులకు వేదపండితులు ఆశీర్వచనాల నడుమ అక్షరాభ్యాసం చేయించారు. పండితులు మాట్లాడుతూ వసంత పంచమి రోజున చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించడం శుభకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఇక పట్టణంలోని సరస్వతి శిశుమందిర్, శ్రీచైతన్య, ఎంజీఎం తదితర పాఠశాలల్లో కూడా నర్సరీ విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు.


జర్నలిస్ట్ ఇంటి స్థలాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : జిల్లాలోని అర్హులైన జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాల పంపిణీపై కలెక్టర్ లక్ష్మీ శ బుధవారం సమీక్షించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సభ్యులు, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్‌డీఓలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జ జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల కోసం భూమిని గుర్తించి శనివారం నాటికి నివేదిక అందించాలని ఆర్డీఓలను ఆదేశించారు. ప్రాథమిక పరిశీలన అనంతరం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న 590 మంది జర్నలిస్టుల జాబితా వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాలు మంజూరు చేసేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డీఓలు నిశాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, డీపీఆర్‌ఓ బాల కొండయ్య, జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సభ్యులు లక్ష్మీకాంత్, శుక్లా, మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : జిల్లావ్యాప్తంగా భూముల రీసర్వే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పురోగతిపై ప్రతి వారం నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వే జిల్లా అధికారి జయరాజ్, సివిల్ సప్లయి జిల్లా అధికారి రాజా రఘువీర్, జిల్లా మేనేజర్ వై.సుమతి పాల్గొన్నారు.

ఇది కదా.. అభివృద్ధి

నాడు–నేడుతో కార్పొరేట్ హంగులు సంతరించుకున్న పాఠశాలలు.. అత్యాధునిక వసతులతో ఆస్పత్రులు.. గ్రామీణుల ఆరోగ్యరక్షణకు విలేజ్ క్లినిక్‌లు.. నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లు, మురుగు మరుగు చేస్తున్న డ్రైనేజీ కాలువలు.. ఇళ్లు కాదు ఊర్లుగా మారిన జగనన్న కాలనీలు.. పేదల కోసం సకల సౌకర్యాలతో టిడ్కో గృహాలు.. ఆహ్లాదం పంచుతున్న సుందర పార్కులు.. విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడా మైదానాలు.. ఇంటి ముంగిటకే సేవలందించే సచివాలయాలు.. అబ్బో ఒకటా రెండా..! వెంకటగిరి పట్టణంలో ఎటు చూసినా అభివృద్ధి ఆనవాళ్లే కనిపిస్తున్నాయి. గతానికి నేటికీ తేడా గమనించిన స్థానికులను అబ్బురపడేలా చేస్తున్నాయి. పార్టీలకు అతీతంగా అందరినీ ఆలోచింపజేస్తూ.. ఆకట్టుకుంటున్నాయి.



వెంకటగిరి పట్టణ వ్యూ

మొత్తం జనాభా 70 వేలు

వార్డులు 25

ఓటర్లు 43,578

వెంకటగిరి మున్సిపాలిటీ సమాచారం

ఇంటి స్థలాల లబ్ధిదారులు 2,791 మంది

టిడ్కో ఇళ్లు పొందినవారు 1,008 మంది

వెంకటగిరి.. ప్రగతి సిరి

- మారిన పట్టణ రూపు రేఖలు
- అబ్బురపరుస్తున్న అభివృద్ధి పనులు
- అత్యాధునికంగా ప్రభుత్వ బడులు, ఆస్పత్రులు
- ప్రజల ముంగిటకే సకల సేవలు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఆధునిక మౌలిక వసతులతో మెరుగైన జీవన ప్రమాణాలు

సైదాపురం/వెంకటగిరి రూరల్: ఒకప్పుడు అన్ని రంగాల్లో వెనుకబడిన వెంకటగిరి పట్టణం ప్రస్తుతం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. నాడు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన ఈ ప్రాంతం.. నేడు మారిన రూపురేఖలతో అబ్బురపరుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.వందల కోట్లతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అలాగే నియోజకవర్గంలోని రైతులకు అందుబాటులో రూ.53లక్షలతో వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

మరో పట్టణంగా జగనన్న కాలనీ

పురపాలక పరిధిలోని 25 వార్డులకు సంబంధించి వెంకటగిరికి సమీపంలో చెవిరెడ్డిపల్లె వద్ద రూ. కోట్లు విలువైన 90 ఎకరాల్లో జగనన్న లేఅవుట్ వేశారు. 40 అడుగుల వెడల్పుతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆ కాలనీలో 2,791 మందికి ఇంటి స్థలాలు అందించారు. గృహ నిర్మాణానికి రూ. 1.80 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఇప్పటికే ఈ కాలనీలో 80 శాతం మంది ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని నివాసముంటున్నారు. అలాగే టిడ్కో ఇళ్లను అత్యాధునిక వసతులతో నిర్మించి 1,008 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే జగనన్న కాలనీ, టిడ్కో గృహ సముదాయం ఎదుట సుమారు 110 ఎకరాల్లో రూ. 2 కోట్లతో నగర వనం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



లబ్ధిదారులకు పంపిణీ చేసిన టిడ్కో ఇళ్లు

నవీన పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ హంగులతో ఆకట్టుకుంటున్నాయి. నాడు–నేడు ఫేజ్–1 కింద 26 బడులను రూ.5.64 కోట్లతో అభివృద్ధి చేశారు. ఫేజ్–2 కింద 57 పాఠశాలలను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. అలాగే అన్ని బడుల్లో డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారు.



నాడు–నేడు కింద తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల

ఉత్తమ బోధన



గతంలో విద్యార్థుల ఇబ్బందులు చూసి చలించిపోయేవాడిని. పాలకులు పట్టించుకోక పోవడంతో సేవాభావం ఉన్నవారితో మాట్లాడి పిల్లలకు సాయం చేయమని కోరేవాడిని. కనీస సౌకర్యాలు లేని పాఠశాలను చూసి బాధపడేవాడిని. ఇప్పుడు మా బడిని చూస్తే గర్వంగా ఉంటుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కారణంగా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయి. విద్యార్థులకు ఉత్తమ బోధన అందుబాటులోకి వచ్చింది. చక్కటి వసతులు సమకూరాయి. సంతోషంగా ఉంది.

– డి.నరేష్, ప్రధానోపాధ్యాయుడు, బంగారుపేట

ఉన్నత వైద్యం



కార్పొరేట్ హాస్పిటళ్లలో కూడా లేని విధంగా సీహెచ్‌సీలో ఉన్నత వైద్యం అందిస్తున్నాం. అత్యాధునిక పరికాలు అందుబాటులోకి వచ్చాయి. రోగులు గతంలో వరండాలో పడుకునే దుస్థితి ఉండేది. ఇప్పుడు అధునాతన పడకలు ఉన్నాయి. చిన్నపిల్లలకు సంబంధించిన ప్రత్యేక పరికరాలు సైతం ప్రభుత్వం అందించింది. ప్రజలు కూడా ఆస్పత్రిలో చికిత్సలకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధించవచ్చని అందరికీ అర్థమవుతోంది.

– లక్ష్మి, వైద్యాధికారి, సీహెచ్‌సీ, వెంకటగిరి

సక్రమంగా సంక్షేమం



జగనన్న ప్రభుత్వం మాకు సక్రమంగా అన్ని సంక్షేమ పథకాలు అదుతున్నాయి. గతంలో ఎవరూ చేయలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం పేదల కోసం శ్రమిస్తున్నారు. ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఇంత అద్భుతంగా తయారవుతాయని కలలో కూడా ఊహించలేదు. ఇక ఆస్పత్రికి వెళితే చక్కటి పరికరాలు, వసతులు ఉన్నాయి. ఇంత అభివృద్ధిని ఎన్నడూ చూడలేదు. జగనన్నకు వెంకటగిరి జనం ఎప్పటికీ రుణపడి ఉంటారు.

– కరీమ్‌బాషా, బంగారుపేట, వెంకటగిరి

జగనన్న సహకారంతోనే..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో వెంకటగిరిని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చాం. అడిగిన వెంటనే ప్రగతి పనులను నిధులు మంజూరు చేస్తూ జగనన్న ఎంతో అండగా నిలిచారు. ఒక్కో సచివాలయానికి ప్రత్యేకంగా రూ.50లక్షలు అందించారు. దీంతో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నాం. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించడంతోపాటు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించడం ఆనందంగా ఉంది. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. ఇదే స్ఫూర్తితో పట్టణాన్ని ఆదర్శవంతంగా.. మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం.

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త

ఆధునికంగా ఆస్పత్రి



ల్యాబ్‌లో ఆధునిక పరికరాలతో సేవలు



వెంకటగిరి సీహెచ్‌సీలో పడకలు

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి గతంలో ప్రజలు వెళ్లాలంటేనే హడిపోయేవారు. అక్కడ సరైన వసతులు లేని కారణంగా వైద్యులు సైతం రోగులను తిరుపతికి రెఫర్ చేసి చేతులుదులుపుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వెంకటగిరి సీహెచ్‌సీని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. రూ.1.66 కోట్లతో అదనపు భవనం నిర్మించారు. ఆధునిక వైద్యపరికరాలు సమకూర్చారు. కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా ఆపరేషన్ థియేటర్, రూ.20 లక్షల విలువైన ల్యాబ్ పరికరాలు ఏర్పాటు చేశారు. రోగులకు చక్కటి పడకలు, వార్డుల్లో వసతులు కల్పించారు. ప్రజలకు సత్వర వైద్యసేవలు అందిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సేవలు

వార్డు సచివాలయాల ద్వారా ప్రజల ఇంటి ముంగిట కే సకల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. రూ.7 కోట్లతో ఏడు సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చేతికే అందజేస్తున్నారు.



రైతుల కోసం నిర్మించిన అగ్రిల్యాబ్



టిడ్కో ఇళ్ల కోసం ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్



టిడ్కో గృహ సముదాయంలో రోడ్డు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం



110 ఎకరాల్లో సిద్ధమవుతున్న నగర వనం

విజయమే లక్ష్యంగా దిశానిర్దేశం

- సత్యవేడులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం/నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలో సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌ను నేతలు, కార్యకర్తలకు పరిచయం చేశారు. సమావేశానికి నారాయణవనం, పిచ్చాటూరు, కేవీబీ పురం, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన పార్టీ నాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. అభ్యర్థి ఎవరైనా మనకి జగనన్నే ముఖ్యమని, ఆ దిశగా పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. 2019లో వచ్చిన 43వేల మెజారిటీ కంటే ఎక్కువ ఆధిక్యత రావాలని సూచించారు. రాబోయే ఎన్నికలు ఎంతో కీలకమని, ప్రతి కార్యకర్త, నాయకుడు తామే అభ్యర్థులుగా భావించి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, జిల్లా మహిళా అధ్యక్షులు బొర్రా మాధవి, సోషల్ మీడియా జిల్లా కో–కన్వీనర్ వేలూరు రాకేష్, ముదిరాజ్ సంఘం డైరెక్టర్ తరిణి ధనంజయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు నాయుడు దయాకర్‌రెడ్డి, సుశీల్ కుమార్ రెడ్డి, అపరంజిరాజు, సౌరకాయలు, ఆరణి విద్యానాథరెడ్డి , గవర్ల కష్ణయ్య , వెంకటచలపతిరాజు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివ శంకర్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, కైలాసకోన ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంయాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సత్యవేడు నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు

సేవకుడిగా పనిచేస్తా..

వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గం సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో సేవకుడిలా పనిచేస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని వెల్లడించారు.

టీపీ కోటలో మూషిక జింక



నాగలాపురం: మండలంలోని టీపీ కోట గ్రామంలో ఓ అరుదైన జంతువు దర్శనమిచ్చింది. రెండు రోజుల క్రితం మాజీ సర్పంచ్ తమీయుల్లా కుమారుడు షారుక్ తమ పొలాల వద్దకు వెళ్లగా అక్కడ చిత్రమైన జంతువు కనిపించింది. దీంతో వెంటనే ఆ జంతువును తన సెల్‌ఫోన్‌లో ఫొటో తీశాడు. ఈ విషయాన్ని సత్యవేడు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లాడు. ఆయన ఆ ఫొటోను పరిశీలించి మూషిక జింకగా గుర్తించారు.

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ నేతలు


నేతలకు పార్టీ కండువాలు వేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు : మండలంలోని కందాడు పంచాయతీ సదాశివపురం గ్రామానికి చెందిన 150 మంది బీజేపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. బుధవారం రేణిగుంట మండలం పార్టీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి సమక్షంలో బీజేపీకి చెందిన జ్యోతీష్, రవికుమార్, శశికుమార్, పవిత్ర, రవి, వెంకటేష్, వెంకటసుబ్బయ్య, గోవిందయ్య, భానుమతి, సుబ్రమణ్యం, రవిచంద్ర, మహేంద్ర, షణ్ముగం, లోకేష్, మోహన్, దేశమ్మ తదితరులు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, నాయకులు కందాటి ప్రభాకర్ రెడ్డి, కుప్పాల వెంకటేష్, శేఖర్ రాజు, మధు యాదవ్, రామయ్య ఆచారి,స య్యద్ మునిరత్నంరెడ్డి, మునికృష్ణారెడ్డి, గుణశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

భక్తులకు నగలు, నగదు అప్పగింత


భక్తులకు పర్సు అందజేస్తున్న చైర్మన్ అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో హెచ్.శ్రీనివాసరావు దంపతులు బుధవారం క్యూలో స్వామివారి దర్శనానికి వెళుతూ తమ పర్సు పోగొట్టుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరి యాదవ్ గమనించి పర్సును ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు అందజేశారు. ఆయన ఎస్పీఎఫ్ సిబ్బంది సమక్షంలో పర్సును ఓపెన్ చేయగా నాలుగు సవర్ల బంగారు చైను, రూ.3వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పర్సు పోగొట్టుకున్న భక్తులను తెలుసుకుని వారికి అందజేశారు.

పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం

తిరుపతి అర్బన్ : జిల్లాలోని పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం అందిచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, వీసీఐసీ, తిరుపతి స్పెషల్ జోన్‌లో పరిశ్రమలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అందించాల్సిన అన్ని రాయితీలను మంజూరు చేయాలని కోరారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ తిరుపతి చంద్ర శేఖర్, తిరుపతి స్పెషల్ జోన్ అధికారి విజయరత్నం పాల్గొన్నారు.


నకిలీ ష్యూరిటీ పత్రాల ముఠా అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సైదాపురం(వెంకటగిరి) : కోర్టులు, పోలీస్‌స్టేషన్‌లో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నకిలీ జామీను పత్రాలు అందిస్తున్న ముఠాను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ కథనం మేరకు.. ఇటీవల సెబ్ అధికారులు గంజాయి తరలిస్తున్న కేరళకు చెందిన షాధీనథామస్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నెల్లూరు–1 కోర్టులో బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. లోకల్ జామిన్ దారుల కోసం నెల్లూరుకు చెందిన రాఫూఫ్‌ను సంప్రదించాడు. ఈ మేరకు రాఫూఫ్ వెంకటాచలం మండలం చౌటపాళెం గ్రామానికి చెందిన రమేష్, కోటేశ్వరరావు, మందా పరిశుద్ధలకు నకిలీ ష్యూరిటీ పత్రాలు సిద్ధం చేసి వెంకటగిరి కోర్టుకు పంపారు. స్థానిక రమేష్ సృష్టించిన పత్రాలపై కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. విచారించాలని పోలీసులను ఆదేశించింది. దర్యాప్తు చేసిన పోలీసులు మొత్తం గుట్టును రట్టు చేశారు. ఎస్పీ మల్లికా గార్గ్ ఆదేశాల మేరకు నకిలీ పత్రాలు తయారు చేస్తున్న కొడివేటి రమేష్, సయ్యద్ అబ్దుల్, నరసింహులు అదుపులోకి తీసుకున్నారు. కేసు ఛేదించిన సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, జిత్యనాయక్‌కు ఎస్పీ రివార్డులు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు.

దొంగే..దొంగ ఓటర్లంటూ..!

దొంగ ఓట్లు..డబుల్ ఎంట్రీ పేర్లు..చనిపోయినా ఓటర్ లిస్ట్‌లో కొనసాగింపు..ఒక ఊరిలో నివాసం ఉంటూ అక్కడితో పాటు మరో ఊరులోనూ ఓటు నమోదు చేసుకోవడం..ఇలా ప్రతి విషయంలోనూ దొంగే.. దొంగ దొంగ అంటూ కేకలు వేసినట్లు టీడీపీ నేతలు చంద్రగిరి నియోజకవర్గంలో హడావిడి చేస్తున్నారా?. సొంత బాబాయి..పిన్నమ్మ.. బంధువులకు ఇతర ప్రాంతాల్లోనూ ఓటు నమోదు చేయించి దొంగ ఓట్లకు ముందస్తు ప్రణాళిక వేసుకున్నారా..?. ఎక్కడ తమ తప్పులు బయటపడుతాయోనని ముందుగానే రోడ్డెక్కి లబోదిబోమంటున్నారా?. తాము చేస్తున్న ఆరోపణలు, బురదజల్లే ప్రయత్నాలకు ఫలితం లేకపోవడంతో, కొత్తగా పెయిడ్ ఆర్టిస్ట్‌ల ద్వారా విమర్శలు చేయిస్తున్నారా?. పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తే తమ అనుకూల దొంగ ఓట్లు ఎక్కడ బయటపడతాయోనని భయంతో అభద్రతలో ఉన్నారా?. దొంగచాటుగా ఫిర్యాదులు చేస్తూ అధికారులను పక్కదారి పట్టిస్తున్నారా?. క్షేత్రస్థాయి విచారణలో అవుననే సమాధానాలు లభిస్తున్నాయి.



- చంద్రగిరి నియోజకవర్గంలో 'కమ్మ'గా డబుల్ ఎంట్రీలు
- పులివర్తివారిపల్లెలోనూ ఇదే తీరు..
- పులివర్తి నాని చిన్నన్నకు కందులవారిపల్లెలోనూ ఓటు
- గురివింద సామెతలా టీడీపీ నేతల హడావుడి



టీడీపీ నేతలు, వారి బంధువులకు సంబంధించిన డబుల్ ఎంట్రీ ఓటరు కార్డులు

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతల విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిస్సంకోచంగా కుట్రలకు తెరతీస్తున్నారు. పచ్చ బ్యాచ్‌తో దొంగ ఓట్లను నమోదు చేయిస్తూ.. ఆ బురదను వైఎస్సార్‌సీపీకి అంటించేందుకు శతవిధాలా యత్నిస్తున్నారు. చివరకు రోడ్లపైకి వచ్చి కపట నాటకాలు ఆడుతున్నారు. గుట్టుగా నకిలీ ఓటర్లను జాబితాలో చేర్పిస్తూ.. పైకి మాత్రం నెపం అధికార పార్టీపై వేసేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

ఇవిగో ఆధారాలు

- ఇతడి పేరు పులివర్తి హరిహరచౌదరి. పాకాల మండలం పులివర్తివారిపల్లెకు చెందిన వ్యక్తి. టీడీపీ నేత పులివర్తి నానికి స్వయానా చిన్నన్న. ఇతడికి పోలింగ్ స్టేషన్ 106లో సీరియల్ నెంబర్ 696లో బీడీజీ 2209658 నంబర్‌తో ఓటు ఉంది. అలాగే పోలింగ్ స్టేషన్ 115లో సీరియల్ నంబర్ 193లో ఐఏఎక్స్1713635తో మరో ఓటు ఉంది. రెండు చోట్లా ఓటు నమోదు చేసుకుని అధికారులకు మస్కా కొడుతున్నాడు.
- ఈమె పేరు కళావతి బొల్లినేని. పులివర్తి నాని చిన్నన్న హరిహరచౌదరి సతీమణి. ఈమెకు పులివర్తివారిపల్లె పోలింగ్ స్టేషన్ 106లో సీరియల్ నంబర్ 697లో బీడీజీ 2209716 నంబర్‌తో ఓటు ఉంది. అలాగే నారా చంద్రబాబునాయుడు స్వగ్రామం నారావారిపల్లె ఉన్న కందులవారిపల్లె పోలింగ్ స్టేషన్ 115లో సీరియల్ నంబర్ 194లో ఐఏఎక్స్1713643తోనూ మరో ఓటు ఉంది.
- ఇతడి పేరు జి.సుధాకర్‌నాయుడు. ఈయనకు పోలింగ్ స్టేషన్ 353లో సీరియల్ నంబర్ 76లో ఐఏఎక్స్1043033 ఎపిక్ కార్డుతో ఓటరుగా నమోదయ్యాడు. మళ్లీ 335 పోలింగ్‌కేంద్రలోనూ సీరియల్ నంబర్ 917లో ఐఏఎక్స్0089367 కార్డుతో ఓటరుగా ఉన్నాడు.
- ఇతని పేరు పి.చిట్టిబాబునాయుడు. ఈయన పోలింగ్ స్టేషన్ 353లో సీరియల్ నంబర్ 254లో ఐఏఎక్స్0658260 కార్డుతో ఓటరుగా నమోదు అయ్యాడు. మళ్లీ పోలీంగ్‌స్టేషన్ 335లోనూ సీరియల్ నంబర్ 539లో ఎంజెడ్‌టీ4682480 కార్డుతో ఓటరుగా ఉన్నాడు.
- ఈమె పేరు పి.వనజ. చిట్టిబాబునాయుడు భార్య. ఈమెకి పోలింగ్ స్టేషన్ 353లో సీరియల్ నంబర్ 323లో ఐఏఎక్స్0430496 కార్డుతో ఓటరుగా నమోదైంది. మళ్లీ పోలీంగ్‌స్టేషన్ 335లోనూ సీరియల్ నంబర్ 540లో ఎంజెడ్‌టీ4681862 కార్డుతో ఓటరుగా ఉంది.
- పులివర్తి నానికి కొడుకు వరస అయ్యే పులివర్తి యజ్ఞా ప్రసాద్ తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. అయినా 106 పోలింగ్ స్టేషన్‌లో సీరియల్ నంబర్ 659లో ఐఏఎక్స్ 1869379 కార్డుతో ఓటరుగా నమోదు చేసుకున్నాడు.
- నానికి వదిన వరసయ్యే పులివర్తి ఉషారాణి కూడా తిరుపతిలోనే నివాసం ఉంటున్నారు. ఆమెకు కూడా ఇదే పోలింగ్ స్టేషన్‌లో సీరియల్ నంబర్ 712లో ఐఏఎక్స్1865948 కార్డుతో ఓటరుగా ఉన్నారు.
- బెంగళూరులో స్థిరపడిన కె.జ్యోతీంద్రనాయుడు కుమారుడు సాయికిశోర్‌కు 106 పోలింగ్ స్టేషన్‌లో 759 నంబర్‌తో ఐఏఎక్స్1377267 కార్డుతో ఓటు ఉంది.
- నానికి సమీపం బంధువు పులివర్తి ఫణీశ్రీ బెంగళూరులో నివాసం ఉంటున్నారు. ఆమెకు సీరియల్ నంబర్ 795 లో ఐఏఎక్స్ 1867746 కార్డుతో ఓటరుగా నమోదు చేసుకున్నారు.
- పులివర్తివారిపల్లెకు చెందిన కె.శ్రీనివాసులునాయుడు చనిపోయాడు. ఆయన పేరును మాత్రం ఓటరు జాబితా నుంచి ఇంకా తొలగించలేదు. సీరియల్ నంబర్ 768 లో ఐఏఎక్స్ 2548972 కార్డుతో ఇంకా ఓటరుగానే ఉన్నారు.

ఇవి మచ్చుకు కొన్నే..ఇలాంటి డబుల్ ఎంట్రీ ఓటర్లను టీడీపీ నేతలు వేల సంఖ్యలోనే నమోదు చేయించారు. ఎంతలా బరితెగించారంటే టీడీపీ నేత పులివర్తి నాని స్వగ్రామం పులివర్తివారిపల్లె పంచాయతీ ఆదెనపల్లెలోని పోలింగ్ స్టేషన్ 106 లో మొత్తం 25 మంది ఓటర్లు ఇలా డబుల్ ఎంట్రీ, స్థిర నివాసం లేకుండా ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో బయటపడింది.

దాచిపెట్టి..గగ్గోలు

ఓటర్ల జాబితాలో అక్రమాలు చేయడం....బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తే వారిని బెదిరించడం....తమ డబుల్ ఎంట్రీ జాబితాను దాచిపెట్టడం. గురివింద గింజల్లా ఎదుటి వారిపై బురదజల్లడం ఇది టీడీపీ నేతల నిత్యకృత్యంగా మారింది. సాక్షాత్తు కలెక్టర్ సమక్షంలోనే అధికారులపై బెదిరింపులకు పాల్పడ్డారు. విచక్షణ మరచి వ్యక్తిగత దూషణలకు దిగారు. తమ సొంత గ్రామాల్లో ఉన్న దొంగ ఓట్లను కాపాడుకునేందుకు శతవిధాల ప్రయత్నాలు చేశారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో ఉలికిపాటు

దొంగ ఓట్లు అంటూ బురదజల్లుతున్న పచ్చ బ్యాచ్ ఆరోపణలపై ఇటీవల ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఇందులో టీడీపీ నేత పులివర్తి నాని సొంత గ్రామంలోనే 25కు పైగా డబుల్ ఎంట్రీ, డెత్, నివాసం ఉండని ఓట్లు నమోదు అయినట్లు గుర్తించారు. అలాగే తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె, వేమూరు, రామచంద్రాపురం మండలం కమ్మపల్లె, ఎన్ఆర్‌కమ్మకండ్రిగ, గణేశపురం, కమ్మకండ్రిగ, చంద్రగిరి మండలం పనపాకం, కందులవారిపల్లె, భీమవరం గ్రామాల్లోనూ వందల సంఖ్యలోనే డబుల్ ఎంట్రీ ఓటర్లుగా ఉన్నట్లు నిర్ధారించారు. వారిని జాబితా నుంచి తొలగించేందుకు అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో పచ్చ బ్యాచ్ అవాక్కైంది. ఈ క్రమంలో రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ దొంగ ఓటర్లపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


రవి (ఫైల్)


కేవీబీపురం : మండలంలోని బైరాజుకండ్రిగలో సోమవారం ఆత్మహత్యకు యత్నించిన పల్లె రవి(40) అనే వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు.. రవి తన రెండెకరాలతోపాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఇటీవల వచ్చిన తుపాను కారణంగా రూ.4లక్షల వరకు పంట నష్టపోయాడు. మళ్లీ నాలుగు ఎకరాల్లో సాగు చేపట్టగా రూ.2లక్షల నష్టం వచ్చింది. ఈ క్రమంలో అప్పుల వారి ఒత్తిడి పెరగడంతో పురుగుల మందు తాగేశాడు. కుటుంబీకులు శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మరణించాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ


తీవ్రంగా గాయపడిన సురేఖ

నాయుడుపేటటౌన్ : మండలంలోని మేనకూరు సమీపంలో రహదారిపై ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో 8మంది మహిళా కార్మికులు గాయపడ్డారు. వివరాలు.. మేనకూరు సెజ్‌లోని వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న 8 మంది మహిళలు ఆటోలో నాయుడుపేట నుంచి బయలు దేరారు. హిందుస్తాన్ గ్లాస్ పరిశ్రమ వద్ద ఆటోను రోడ్డు పక్కగా నిలిపి మహిళలు కిందకు దిగుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో నాయుడుపేటకు చెందిన సురేఖ, టి.జ్యోతి, ఎస్.సులోచన, వజ్రమ్మ, మరో నలుగురు మహిళలు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సురేఖను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17న నింగిలోకి 'జీఎస్ఎల్‌వీ'



ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని పొందికగా అమర్చుతున్న దృశ్యం, వ్యాబ్‌లో సిద్ధంగా జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5.32 గంటలకు జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ద్వారా 2,272 కిలోల ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపించేందుకు సర్వం సిద్ధం చేశారు. వాతావరణం, విపత్తులకు సంబంధించిన ఈ ఉపగ్రహానికి అయ్యే వ్యయాన్ని మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ భరిస్తోంది. ఈ క్రమంలో 16వ తేదీన షార్‌లో ఈ ప్రయోగానికి సంబంధించి ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం కౌంట్‌డౌన్, ప్రయోగ సమయాన్ని అధికారికంగా నిర్ణయించనున్నారు. పీఎస్ఎల్‌వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే, జీఎస్ఎల్‌వీని మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. 51.7 మీటర్ల పొడవైన జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్ ప్రయోగ సమయంలో 420 టన్నుల బరువుతో భూమినుంచి నింగికి బయలు దేరుతుంది. రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ అనుసంధానం పూర్తి చేసి ఆదివారం సాయంత్రం రాకెట్‌ను వ్యాబ్‌నుంచి ప్రయోగవేదిక మీదకు నెమ్మదిగా తరలించే ప్రక్రియను పూర్తి చేశారు. జీఎస్ఎల్‌వీ మార్క్2 సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం కావడం విశేషం.

అభ్యర్థులకు అకౌంట్.. చెక్‌బుక్ తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులకు ప్రత్యేకంగా బ్యాంక్ అకౌంట్, చెక్‌బుక్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు ఎన్నికల వ్యయం తెలియజేసేందుకు బ్యాంకు వివరాలను అందించాలని సూచించారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల స్థానాలు, వాటి పేర్లపై సవరణలు ఉంటే సంబంధిత ఈఆర్‌ఓలు ప్రతిపాదనలు పంపాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం డీఆర్‌ఓ పెంచల కిషోర్ తుది ఓటరు జాబితా ప్రచురణపై క్లైయిమ్‌లు, అభ్యంతరాలు తదితర అంశాలను రాజకీ య పార్టీల ప్రతినిధులకు వివరించారు. సమావేశంలో ఈఆర్‌ఓలు రవిశంకర్ రెడ్డి, నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు మరో రెండు పరిశ్రమలు

- రూ.1,198 కోట్లతో కార్బన్ బ్లాక్ కంపెనీ
- రూ.350 కోట్లతో హెల్లా ఇన్‌ఫ్రా యూనిట్
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన మంత్రి అమర్‌నాథ్


రెండు యూనిట్ల శంకుస్థాపనలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అధికారులు

తిరుపతి అర్బన్ : నాయుడుపేట స్పెషల్ జోన్‌లో ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన రెండు పరిశ్రమలకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వర్చువల్ విధానంలో బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.1198 కోట్లతో కార్బన్ బ్లాక్ యూనిట్, రూ.350 కోట్లతో హెల్లా ఇన్‌ఫ్రా యూనిట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, ఏపీఐఐసీ జడ్‌ఎం చంద్ర శేఖర్, తిరుపతి స్పెషల్ జోన్ అధికారి విజయ రత్నం పాల్గొన్నారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోందని, సింగిల్ విండో ద్వారా అనుమతులను సకాలంలో మంజూరు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023లో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు పలు ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ ఆధారంగా నాయుడుపేట, తడ, సూళ్లూరుపేట ,శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు ప్రాంతాల్లో పలు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. దీంతో తిరుపతితోపాటు సమీప ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.

60 ఎకరాల్లో కార్బన్ బ్లాక్ యూనిట్

కార్బన్ బ్లాక్ యూనిట్‌కు ప్రభుత్వం 60 ఎకరాలను కేటాయించింది. మూడేళ్లలో ఈ యూనిట్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ కంపెనీ ద్వారా ప్రత్యక్షంగా 250 మందికి , పరోక్షంగా 2,500 మందికి ఉపాధి లభించనుంది.

26.5 ఎకరాల్లో హెల్లా ఇన్‌ఫ్రా

హెల్లా ఇన్‌ఫ్రా యూనిట్‌కు 26.5 ఎకరాలను కేటాయించారు. మూడేళ్లలో ఉత్పత్తులు రానున్నాయి. ప్రత్యక్షంగా 360 మందికి పరోక్షంగా 700 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు.అలాగే వైజాగ్– చెన్నై కారిడార్‌లో భాగంగా రూ. 423 కోట్లతో ఈ రెండు యూనిట్లకు అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పవర్ సప్లై వసతులు కల్పించనున్నారు.

లైంగిక దాడికి యత్నించిన నిందితుడి అరెస్ట్

నాయుడుపేటటౌన్ : పట్టణంలో 9 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిని పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. వివరాలు.. స్థానిక ఎమ్మార్ నగర్‌కు చెందిన బాబా అలియాస్ బాబు అనే వృద్ధుడు ఓ బాలికతో కొన్నాళ్లుగా అసభ్యంగా ప్రవర్తిస్తుండగా బాలిక తల్లి గుర్తించింది. దీంతో రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరుపతి దిశ డీఎస్పీ కాటమరాజు ఆధ్వర్యంలో నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.